క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దామరగిద్ద: మండలంలోని కాన్కుర్తి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్‌లకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ అనిల్ కుమార్ తెలిపారు. రైతులు ఇతర వినియోగదారులు గుర్తించి సహకరించాలన్నారు. ఉప విద్యుత్ కేంద్రం పరిధిలోని ఉల్లిగుండం, గడిమున్కన్‌పల్లి, కాన్కుర్తి, ఉడ్మల్‌గిద్ద, మల్‌రెడ్డిపల్లి, కాన్కుర్తి గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలియజేశారు.

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ జయరాములు తెలిపారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి చేతుల మీదుగా చెక్కులు అందజేయనున్నారని, అర్హులైన లబ్ధిదారులు హాజరై చెక్కులను పొందాలని కోరారు.

వేతనాల విడుదలపై కార్మికుల హర్షం



నర్వ: పంచాయతీ పెండింగ్ వేతనాలు విడుదల చేయడంపై పంచాయతీ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక పంచాయతీ వద్ద సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను కార్మికుల అభ్యర్థన మేరకు విడుదల చేసి కార్మికులకు న్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గొల్ల రామచంద్రి, శ్రీనివాసులుగౌడ్, నర్సోజీ, నర్సింహులు, సామేలు, శివప్రసాద్, జయప్రకాష్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మమాట.. అంగన్‌వాడీ బాట ర్యాలీ



ఊట్కూరు: మండలంలోని ముగ్దుంపూర్ గ్రామంలో అమ్మమాట.. అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమంలో భాగంగా గురువారం చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు.. అంగన్‌వాడీ టీచర్ పద్మావతి మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వాహనాల పరిశీలన



కోస్గి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉన్న ప్రభుత్వ పోలీస్ వాహనాలను గురువారం ఎంటీఓ ఆర్ఎస్ఐ శివ శంకర్ తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కోస్గి సర్కిల్ పరిధిలోని సీఐ, ఎస్ఐ వాహనాలతోపాటు స్టేషన్‌లో ఉన్న ఇతర ప్రభుత్వవాహనాలను పరిశీలించారు. కావాల్సిన మరమ్మతులు చేయించారు. వాహనాలను ఎప్పటికప్పుడు చెక్ చేయించి అవసరమైన ఆయిల్, ఇతర అంశాలను తనిఖీలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటీఓ మెకానిక్ పీసీలు నర్సింహ, నరేష్‌తోపాటు ఆయా వాహనాల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

మక్తల్: పట్టణంలో అంబేడ్కర్ నగర్‌లోని బాలుర గురుకుల పాఠశాలను గురువారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు.. గురుకులాల్లో సమస్యలు, సౌకర్యాలు ఎలా ఉన్నయో తెలుసుకునేందుకు ఎమ్మెల్యే తనిఖీ చేపట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు

పోచమ్మ బోనాలకు ఆలయం ముస్తాబు

కోస్గి: ప్రతియేటా ఆషాఢ మాసంలో నిర్వహించే గ్రామ దేవతల బోనాల వేడుకలో భాగంగా శుక్రవారం పోచమ్మ గ్రామ దేవతకు బోనాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పట్టణ శివారులోని పోచమ్మ ఆలయాన్ని రంగులు వేసి ముస్తాబు చేశారు. కులాలకతీతంగా పట్టణంలోని అన్నికాలనీల ప్రజలు సమిష్టిగా అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఈ మేరకు ఆలయాన్ని వేడుకలకు సిద్ధం చేశారు.







మద్దూర్‌లో చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, దామరగిద్దలో..



కోస్గిలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రుణమాఫీపై రైతుల హర్షం

కృష్ణా: ప్రభుత్వం రైతులకు రుణవిముక్తి కల్పిస్తూ ఏకకాలంలో రూ. 2 లక్షల రుణాన్ని మాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో గురువారం స్థానిక రైతు వేదికలో రైతులు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ లక్ష రూపాయల లోపు ఉన్న రుణాలను మాఫీచేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందని అన్నారు. అలాగే ముడమాల్‌లో గురువారం రైతులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ్, యువజన నాయకుడు భీమశంకర్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌గౌడ్, శివరాంరెడ్డి, కృష్ణయ్య, దండు ఆనంద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: గడువు కంటే ముందే ఇచ్చినమాట మేరకు రైతులకు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మొదటి విడతలో రూ.1లక్ష రుణ మాఫీ చేసిన సందర్భంగా గురువారం పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. స్థానిక శివాజీ చౌరస్తాలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ వార్ల విజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, నాయకులు అన్న కిష్టప్ప, నాగులపల్లి నరేందర్, ఇద్రీస్, కోడిగంటి హరి, వెంకట్రాములు, దోమ రాజేశ్వర్, టింట్ నర్సింహ పాల్గొన్నారు. అలాగే చంద్రవంచ రైతు వేదికలో సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, మండల ప్రత్యేకాధికారి సాయిబాబా, ట్రెయినీ ఐఏఎస్ నరుల్లా, ఏఓ రామకృష్ణతోపాటు మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మండల రైతులు పాల్గొన్నారు.



కృష్ణాలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

దామరగిద్ద: ఏకకాలంలో పంట రుణాలు మాఫీ చేపట్టిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదని మండల పార్టీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, విండో అధ్యక్షుడు ఈదప్ప, మాజీ సర్పంచ్ శరణ్యానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సంజీవరాయ చౌరస్తాలో, బాపన్‌పల్లి రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం రైతులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు.. బాపన్‌పల్లి రైతు వేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు. లక్ష లోపు రుణమాఫీ ప్రక్రియతో శ్రీకారం చుట్టిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు మాజీ ఎంపీటీసీ బస్వరాజ్, హన్మంతు, వెంకటప్ప, అశోక్, రఘు, వెంకట్రామరెడ్డి, కిష్టారెడ్డి, చంద్రశేఖర్, శివకుమార్, ఆనంద్, భాస్కర్ పాల్గొన్నారు.

మద్దూరు: రైతులకు రూ. లక్ష మాఫీ చేయడంతో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద, కొత్తపల్లిలో సీఎం రేవంత్, ఇతర మంత్రుల చిత్రపటాలకు రైతులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. అలాగే స్థానిక రైతు వేదిక, కొత్తపల్లి మండలంలోని లింగల్‌చేడ్ రైతు వేదికలో రుణమాఫీ పథకాన్ని సీఎం రేవంత్ లాంఛనంగా ప్రారంభించానికి రైతులు వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, రైతులు వీక్షించారు. ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి సుదర్శన్, నోడల్ అధికారిణి హరిత, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, ఏఈఓ శ్రావణ్, శివ, శిరీషా, తిర్మలేష్, రైతులు రఘుపతిరెడ్డి, సంజీవ్, బాబుస్వామి, అశోక్, ఇబ్రహీం, మహేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి,భీములు పాల్గొన్నారు.

మరికల్: ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో రైతులు హర్షం వ్యక్తంచేశారు. గురువారం కన్మనూర్‌లో సీఎం రేవంత్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు పాల్గొని వీక్షించారు. రైతులకు సూచించిన సందేహాలు, సూచనలు పాటించాలని ఏఓ శివకుమార్ రైతులను కోరారు. కార్యక్రమంలో ఏఓ శివకుమార్, పరుశురాం, అనిత, భరద్వాజ్, ప్రతాప్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, కృష్ణయ్య, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ముడుమాల్‌లో..



చంద్రవంచ రైతు వేదికలో..



మరికల్‌లో..

ధూపదీప నైవేద్యం పథకంపై విచారణ

ఊట్కూరు: మండలంలోని ఎర్గాట్‌పల్లిలో సంజీవరాయ ఆలయంలో గురువారం దేవాదాయ, శాఖ ధూపదీప నైవేద్యం పథకం ప్రీమియం కమిటీ సభ్యులు విచారణ చేపట్టారు. ఆలయం అర్చకుడిగా తమకు తెలియకుండా మరో వ్యక్తి లబ్ధిపొందుతున్నారని కొంతమంది గ్రామస్తులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే కమిషనర్‌కు సమాచారమందించడంతో ధూపదీప నైవేద్యం పథకం ప్రీమియం కమిటీ సభ్యులు ఆనంద్‌శర్మ అధికారులతో కలిసి ఎర్గాట్‌పల్లి ఆలయాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. ఆలయంలో డీడీ ఎన్ఎస్ స్కీం ఎవరి పేరిట వచ్చింది తదితర వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు.. ఆనంద్‌శర్మ మాట్లాడుతూ విచారణ చేసిన నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పురేందర్‌కుమార్, గ్రామస్తులు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎర్గాట్‌పల్లిలో విచారణ చేస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎల్కోటి నారాయణరెడ్డి

ఊట్కూరు: మండల పరిధిలోని సమస్తాపూర్ గ్రామ శివారులో గురువారం మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ఎల్కోటి నారాయణరెడ్డి పూజలు నిర్వహించి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రూ. 15లక్షల నిధులను మంజూరు చేశారని, ఇట్టి నిధులచే సమస్తాపురం నుంచి ఇడ్లూరు శంకర్‌లింగేశ్వరం ఆలయం వరకు సీసీ రోడ్డు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, గోవిందు, ఎల్లప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాలి

కృష్ణా: మండలంలో కృష్ణానది నుంచి జరుగుతున్నా ఇసుక అక్రమ రవాణకు రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, నియోజకవర్గ నాయకుడు బల్‌రాంరెడ్డి ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ముడుమాల్ నుంచి ప్రతిరోజూ రాత్రి, పగలు తేడా లేకుండగా నదిలోని ఇసుకను అక్రమంగా టిప్పర్ల ద్వారా కర్ణాటకకు తరలిస్తున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని అన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు జయానంద్‌రెడ్డి,కర్నెస్వామి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



నారాయణ పేటలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షురాలు మిస్కిన్ బాలమణి



మక్తల్‌లో ..

నారాయణపేట: ఆశా వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని గురువారం పర్ణికారెడ్డి క్యాంప్ కార్యాలయంలో సిబ్బంది సందీప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు.. యూనియన్ అధ్యక్షురాలు మిస్కిన్ బాలమణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆశాకార్యకర్తలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, ఫిబ్రవరి 9న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మెల్యే కార్యాలయంలో వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కనీస వేతనం రూ.18వేలు నిర్ణయించి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు విజయలక్ష్మి, రాధిక, శశికళ, అనురాధ, జొన్నల స్వాతి రాధిక తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు.. జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ.. ఆశావర్కర్ల పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, గోవిందురాజ్, ఆశా వర్కర్లు గోవిందమ్మ, ఇందిరా, బాలమణి, పద్మమ్మ, అంజమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు





నందిపాడ్‌లో విచారణ చేస్తున్న డీఎస్పీ లింగయ్య , మద్దూరు పోలీస్ స్టేషన్‌లో గుంటం

డీఎస్పీ లింగయ్య

మద్దూరు: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని నారాయణపేట డీఎస్పీ పి.లింగయ్య తెలిపారు. గురువారం ఉదయం నందిపాడ్, లక్కయిపల్లి గ్రామాల మధ్య మోహర్రం పండుగ సందర్భంగా బుధవారం రాత్రి చెలరేగిన అల్లర్ల సంఘటనలను కోస్గి సీఐ దస్రునాయక్, ఎస్ఐ రాంలాల్‌తో కలిసి డీఎస్పీ పరిశీలించారు. నందిపాడ్‌లో గ్రామస్తులతో మాట్లాడారు. బుధవారం రాత్రి జరిగిన సంఘటనపై ఎస్ఐ రాంలాల్ వివరాల ప్రకారం.. నందిపాడ్ గ్రామంలో మోహర్రం ముగింపు వేడుకల్లో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ క్రమంలో గ్రామంలో అనాధిగా వస్తున్న గుంటం (పల్లకీల్లో పీర్లను ఉంచడం) నలుగురు మొస్తారు. ఈ గుంటం దగ్గర నందిపాడ్ గ్రామానికి చెందిన తలారి అంజిలప్ప కొన్ని రోజుల క్రితం తన పొలానికి వేసిన సోలార్ కంచెను ఎవరు దొంగిలించారని గుంటం మోసే సవారికాళ్లను అడిగాడు. వారు లక్కాయిపల్లి గ్రామానికి చెందిన ఓ వికలాంగ మహిళ ఇంటి దగ్గర వచ్చిన ఆగారు. దీంతో ఆమె దొంగతనం చేసిందని నందిపాడ్ గ్రామస్తులు అనుమానించారు. ఈ క్రమంలో నందిపాడ్ నుంచి లక్కాయిపల్లి వచ్చి తమ గ్రామస్తులపై దొంగతనం ఆరోపణలు చేయడం ఏమిటని ఆగ్రహించిన గ్రామస్తులు గుంటంను, నందిపాడ్ గ్రామస్తులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ అక్కడికి చేరుకొని గుంటంను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కోస్గి సీఐ దస్రునాయక్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని నందిపాడ్ గ్రామ పెద్దల హామీ మేరకు గుంటంను అదేరాత్రి అప్పగించారు. దీంతో గురువారం ఉదయం లక్కాయిపల్లి గ్రామానికి చెందిన యాదగిరి పురాతన ఇల్లు నందిపాడ్‌లో ఉంది. ఆ గ్రామానికి మద్దతు పలికాడని ఆగ్రహించిన గ్రామస్తులు యాదగిరి ఇంటిని కూల్చివేశారు. యాదగిరి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో డీఎస్పీ, సీఐ నందిపాడ్‌కు చేరుకొని విచారణ చేపట్టారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. బాధ్యులపై చట్టపరమైన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

నిషేధిత గుట్కాల పట్టివేత



నారాయణపేట: మండలంలోని పెరపళ్ల గ్రామానికి చెందిన నాగరాజ్ గుట్కా ప్యాకెట్లు తీసుకెళ్తుండగా గురువారం జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి రూ. 7350 విలువగల నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఆ గుట్కాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి నాగరాజ్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

మరికల్: నాటిన ప్రతి మొక్కను కాపాడుకునేందుకు కృషిచేయాలని ఎస్ఐ మురళి అన్నారు. మండలంలోని కన్మనూర్‌లో గురువారం నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని ఐదు మొక్కలను నాటాలని సూచించారు. నాటిన మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ ఊషన్న, నర్సింహులు, రమేష్, మతిన్, భాగ్యలక్ష్మి, బాలనారాయణ, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖరయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎస్ఐ మురళి

రాయల చంద్రశేఖర్ మృతి తీరని లోటు

నారాయణపేట: సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కిసాన్ సంయుక్త మోర్చా నాయకులు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ మృతి ప్రజా విప్లవ ఉద్యమాలకు తీరని లోటని పార్టీ నాయకులు పలువురు స్మరించుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తాలో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డివిజన్ నాయకులు ప్రశాంత్, నర్సింహులు మాట్లాడుతూ.. రాయల చంద్రశేఖర్ ప్రజా పోరాటాల్లో 50సంవత్సరాలు అలుపెరుగని పోరాటం కృషిచేశారని గుర్తుచేశారు. బుధవారం రాత్రి ఊహించని విధంగా ట్రైన్ ప్రమాదంలో చంద్రశేఖర్ మృతిచెందడం ప్రజా పోరాటాలకు తీరని లోటన్నారు. కృష్ణ, రాములు, అంజి, చెన్నప్ప, కెంచె నారాయణ, ప్రసాద్, పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి సలీం, జిల్లా నాయకులు బాలు, రాము పాల్గొన్నారు.



చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బడి బాధ్యత ఎవరికీ పట్టదా?

- భవనం నిర్మించారు, వసతులు మరిచారు
- అద్దె భవనంలో అసౌకర్యాల మధ్య చదువులు
- ఒంటికి రెంటికి, ఆరుబయటకే..
- మౌలిక వసతులు లేక వృథాగా కొత్త భవనం
- మనఊరు – మనబడి తెచ్చిన సమస్యలు



జీపీఎస్‌లో తరగతులు నిర్వహిస్తున్న రేకుల షెడ్ భవనం



అద్దె భవనంలో ఆరుబయట తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు

దామరగిద్ద: మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలకు మనఊరు– మన బడిలో కొత్తభవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏడాదిన్నర క్రితం అప్పటికే ఉపయోగంలో ఉన్న పాత భవనాన్ని కూల్చి కొత్త భవనం నిర్మాణ చేపట్టడంతో పాఠశాల తరగతులను ఎలాంటి సదుపాయాలు లేని రేకుల షెడ్డు కలిగిన అద్దె భవనంలోకి మార్చారు. పాత భవనం కూల్చివేత సమయంలో ఉన్న పాత మరుగుదొడ్లను వంటగదిని సైతం తొలగించారు. కొత్తగా మరుగుదొడ్లు, వంటగది నిర్మాణం చేపట్టేందుకు పీఆర్ నిధులు కేటాయిస్తామని, మన ఊరు –మన బడిలో పాఠశాల కొత్త భవనం నిర్మాణం చేపట్టారు. తీర భవన నిర్మాణం పూర్తయిన, మరుగుదొడ్లు మూత్రశాలలు వంటగది మాత్రం నిర్మాణం చేయకపోవడంతో గత ఏడాదిన్నర కాలంగా విద్యార్థులు అసౌకర్యాల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు.

భవనాన్ని ప్రారంభించి నెలరోజులు గడిచినా..

నియోజకవర్గ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి గత నెల 14న అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో కొత్త భవనాన్ని ప్రారంభించారు. భవనాన్ని ప్రారంభించి నెలరోజులు గడిచినా ఉపయోగంలోకి రాకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక గ్రామ ప్రజలు పాఠశాలపై అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అద్దెభవనంలో అవస్థలు..

కొత్త భవనం ఉపయోగంలోకి రాకపోవడంతో గత ఏడాదిన్న కాలంగా అద్దె భవనంలో విద్యార్థులు ఉపాధ్యాయులు కనీస వసతులు లేని పాఠశాలను కొనసాగిస్తున్నారు. నాలుగు గదులలో 217మంది విద్యార్థులు నలుగురు, ఉపాధ్యాయులు రేకుల షెడ్‌లోనే కొనసాగిస్తున్నారు. విద్యార్థులకు గదులు సరిపడక పోవడంతో చెట్లకింద, ఆరుబయటే కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. కొత్త భవనంలో మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల నిర్మాణం , కిచెన్ షెడ్, ప్రహరి, వంటి సదుపాయలను ఏర్పాటుచేసి ఉపయోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిరుపయోగంగా కొత్త భవనం

అద్దె భవనంలో సౌకర్యాలు లేవు..



అద్దె భవనంలో ఎలాంటి సౌకర్యాలు లేవు. గదులు కొరతతోపాటు మరగుదొడ్లు, మూత్రశాలలు వంటగది సదుపాయం లేదు. విద్యార్థులు పాడుబడిన ఇళ్ల మధ్యకు మూత్రాలకు వెళ్తుంటారు. చెట్ల కింద వంట చేపడుతున్నాం. వర్షం వస్తే పాఠశాల ఆవరణలోని నీల్లు నిలుస్తాయి

– అలవేలు మంగ, హెచ్ఎం, దామరగిద్ద

రేకుల షెడ్ గదుల్లో ఉక్కపోత..



ఒక్కో గదిలో 40నుంచి 50మంది విద్యార్థులం కూర్చుంటాం. గదులు సరిపడకా గాలి వెళ్తురు ఆడక, రేకుల షెడ్‌లో వేడికి ఉక్కపోదగా ఉంటుంది. ఉక్కపోతతో చెమటలు పడతాయి. అధికారులు స్పందించి కొత్త భవనంలో సదుపాయాలు కల్పించి అక్కడే పాఠాలు బోధించాలి.

– నర్సింహులు, ఐదో తరగతి విద్యార్థి

చెట్టుకింద పాఠాలు చెబుతారు..



తరగతిగదులు సరిపడకా చెట్టుకింద పాఠాలు బోధిస్తున్నారు. వర్షం పడితే అందరిని నాలుగు గదుల్లోనే కూర్చోబెడతారు. ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్నాం . వర్షంతో పాఠశాల ముంగిట నీరునిలిచి బురదమయంగా ఉంటుంది. మూత్రశాలలు లేక పాతగోడల మధ్యకు వెళ్తున్నాం. కొత్త భవనంలోకి మార్చాలి.

– పల్లవి, విద్యార్థి, ఐదోతరగతి

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం..

అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో భవన నిర్మాణం చేపట్టి గత నెల 14న ప్రారంభించిన విషయం వాస్తవమే, మౌలిక వసతుల కల్పించి కొత్త భవనాన్ని ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు కలెక్టర్‌తో మాట్లాడి మరుగుదొడ్లు, వంట గది తదితర వసతులను కల్పించేందుకు కృషిచేస్తాం.

– ఎండీ అబ్దుల్ ఘని, డీఈఓ, నారాయణపేట